క్లుప్తంగా

అంధులను ఆదరించాలి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : అంధులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని సీనియర్‌ న్యాయవాది గొర్రె శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం గాంధీ రోడ్డులోని రాయలసీమ ఫర్నీచర్స్‌ వద్ద గాజులపల్లె పెద్ద సుబ్బయ్య, పెద్ద సుబ్బమ్మ సేవా సంస్థ అధ్యక్షుడు గాజులపల్లె రామచంద్రుడు ఆధ్వర్యంలో అంధులకు ఆయన పింఛన్‌ పంపిణీ చేశారు. 49 మంది అంధులకు రూ.200 చొప్పున పింఛన్‌ అందించారు. అలాగే పబ్బతి శ్రీరాములు రూ.100, భక్త పెంచలయ్య రూ.100, వరదరాజులు రూ.100, నాగేంద్ర కుమార్‌రెడ్డి రూ.50 చొప్పున 49 మంది అంధులకు అందించారు. సురేష్‌కుమార్‌ బిస్కెట్లు, ఆంజనేయులు, లక్ష్మీ దంపతులు స్వీట్లు పంచారు.

ఆశ్రమానికి టీవీ వితరణ

కలసపాడు : మండల కేంద్రానికి చెందిన తెలుగు గంగ ఉద్యోగి బుడత మదన్‌మోహన్‌ యాదవ్‌ మంగళవారం కాశినాయన మండలం ఓబులాపురం వద్ద ఉన్న వివేకానంద సేవాశ్రమానికి టీవీని వితరణ చేశారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని, మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని చేపడుతున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్‌ బేగం తెలిపారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.

అట్లూరు పీహెచ్‌సీ తనిఖీ

అట్లూరు : అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్‌ ఉమామహేశ్వర్‌ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్‌ గదితోపాటు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం జరుగుతున్న ఆశ మీటింగును పరిశీలించి ఆశ వర్కర్లకు విధులు, విధానాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఐఓ కార్యాలయం సీహెచ్‌ఓ మునిరెడ్డి, స్థానిక వైద్యాధికారి డాక్టర్‌ విశ్వంత్‌, సీహెచ్‌ఓ మురళీకృష్ణ, మాణిక్యమ్మ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు అవగాహన

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్‌ సమీర ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆశ కార్యకర్తలకు ఏఎన్‌ఎం యాప్‌పై, తల్లిపాల ప్రాముఖ్యత, గర్భనిర్ధారణ కిట్లపై అవగాహన కల్పించారు. చింతకుంట, మనేరాంపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సురేష్‌బాబు, వికసిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవాస్తవాలను ప్రచారం చేస్తే చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : అవాస్తవాలను ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్‌ తెలిపారు. మంగళవారం ఏఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటుకల బట్టీలో పని చేసే ఒక మహిళను కిడ్నాప్‌ చేశారని ఒక కట్టుకథను అల్లి కొందరు సోమవారం రాత్రి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌ చేశారన్నారు. వాస్తవానికి ఆమె కిడ్నాప్‌ కాలేదని తెలిపారు. అవాస్తవాలను, ప్రజలను రెచ్చగొట్టే కథనాలను ప్రసారం, ప్రచారం చేయొద్దని గతంలో అనేక మార్లు పోలీసుశాఖ తరపున విజ్ఞప్తి చేశామన్నారు. సోషల్‌ మీడియాలో పోస్టింగ్‌ చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

ఘనంగా పీర్ల పండుగ



భారీ జనసందోహం నడుమ ఊరేగుతున్న పీర్లు

పోరుమామిళ్ల : మండల కేంద్రంలో (షహదత్‌) పీర్ల పండుగ ముగింపు సందర్భంగా మంగళవారం వివిధ గ్రామాల నుండి పదివేల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. పట్టణంలో వారం రోజుల నుంచి మొహర్రం వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తూ వచ్చారు.

బి.కోడూరు : మండలంలో హిందూ, ముస్లింలు ఐక్యంగా జరుపుకునే పండుగ మొహర్రం. ఇందులో భాగంగా మండలంలో బి.కోడూరు, పెద్దుళ్లపల్లె, మేకవారిపల్లె తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి.

ఎంఈఓ-1గా కాశయ్య

పోరుమామిళ్ల : మండల విద్యాశాఖ అధికారి-1గా కాశయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంఈఓ-2 గా రత్నస్వామి విధుల్లో చేరిన విషయం తెలిసిందే. కాశయ్యకర్నూలు జిల్లా కోడుమూరు బాలికోన్నత పాఠశాల నుంచి పోరుమామిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పది రోజుల క్రితం బదిలీపై వచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో హెడ్‌మాస్టర్‌గా చేరిన కాశయ్యకు ఎంఈఓ-1గా బాధ్యతలు ఇచ్చారు. మంగళవారం ఎస్టీయూ మండల శాఖ నాయకులు కాశయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులతోపాటు ఎంఈఓ-2 రత్నస్వామి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలో కులమతాలు, పార్టీలకతీతంగా సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం మైదుకూరు పట్టణంలోని 5వ వార్డులో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని మహబూబ్‌నగర్‌, గాంధీనగర్‌ ప్రాంతాల్లోని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుంచి వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వార్డులోని పలువురు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 2014లో అధికారంలో ఉన్న టీడీపీ ఒక్క సంక్షేమ కార్యక్రమాన్ని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. పింఛన్లు, పక్కా ఇల్లు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల సిఫారసు ఉంటేనే వచ్చేవని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. మహిళా పక్షపాతి అయిన సీఎం వైఎస్‌ జగన్‌ మహిళల పేరుతో ఇంటి స్థలాలను మంజూరు చేశారని, పక్కా ఇళ్లను కూడా కట్టిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క ఇంటికి అందుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు.

సమస్యలపై స్పందన



వృద్ధురాలికి పింఛన్‌ సొమ్మును అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

5వ వార్డులో మహబూబ్‌నగర్‌, గాంధీ నగర్‌ ప్రాంతాల్లో పలువురు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే రఘురామిరెడ్డి స్పందించారు. పలు చోట్ల డ్రైనేజీలు కావాలని అడగగా వెంటనే మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ మాచనూరు చంద్ర, వార్డు ఇన్‌చార్జి జమాల్‌ బాషా, కోఆప్షన్‌ సభ్యుడు ట్రాక్టర్‌ గౌస్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ షరీఫ్‌, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ గల్లా నసింహారెడ్డి, కూశెట్టి రాయుడు, భరత్‌ కుమార్‌రెడ్డి, కిరణ్మయి, కందనూరు షరీఫ్‌, సన్న శ్రీనురావు, ఖాదర్‌, నాయబ్‌, ఐతా బాబు, గౌస్‌, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, అధికారులున్నారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించండి

పట్టణంలో జగనన్న కాలనీలో కమ్యూనిటీ హాల్‌ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని మంగళవారం సాయంత్రం బ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. గతంలో జగనన్న కాలనీలో కమ్యూనిటీ హాల్‌ నిర్మాణం కోసం పది సెంట్ల స్థలాన్ని కేటాయించి హద్దులు చూపించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. దానిపై స్పందించిన ఎమ్మెల్యే, జగనన్న కాలనీలో వెంటనే స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బ్రాహ్మణ సంఘం నాయకులు ఉన్నారు.

పట్టణ సుందరీకరణకు కలసికట్టుగా కృషి

బద్వేలు అర్బన్‌ : పట్టణ సుందరీకరణకు ప్రతిఒక్కరం కలసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ పేర్కొన్నారు. పట్టణ సుందరీకరణలో ప్రభుత్వ అధికారులతోపాటు ప్రజలను భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో ఆర్డీఓ ఆకుల వెంకటరమణ ఆధ్వర్యంలో వివేక్‌ లంకమల అనే యువకుడు తన మిత్ర బృందంతో కలిసి చేపట్టిన సస్టైనబుల్‌ బద్వేల్‌ (సుస్థిర బద్వేలు) కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుంచి మున్సిపల్‌ కార్యాలయం వరకు 1కె వాక్‌ నిర్వహించారు. అనంతరం మున్సిపల్‌ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సస్టైనబుల్‌ బద్వేల్‌ పేరుతో పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయడం గొప్ప విషయమన్నారు. ఇందులో భాగంగా క్లీన్‌ బద్వేల్‌ – గ్రీన్‌ బద్వేల్‌, నో ప్లాస్టిక్‌ బద్వేల్‌ పేరుతో సభ్యులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని, ప్రజలు కూడా స్వచ్ఛందంగా పట్టణ సుందరీకరణకు సహకరించాలని కోరారు. ఆర్డీఓ వెంకటరమణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం యువత ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ రాజగోపాల్‌రెడ్డి, అడా చైర్మన్‌ గురుమోహన్‌, టూరిజం కార్పొరేషన్‌ డైరెక్టర్‌ అల్లాబకాష్‌, మున్సిపల్‌ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, తహసీల్దార్లు మధుసూదన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ కె.వి.కృష్ణారెడ్డి, అర్బన్‌ సీఐ జి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ వెంకటరమణ, ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓ వెంకటశేషయ్య, ఇన్‌టూ ది నేచర్‌ టీం సభ్యులు పాల్గొన్నారు.



1కె వాక్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఆర్డీఓలు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం

కలసపాడు : అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని, జగనన్న ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి పేద కుటుంబాల్లో సంక్షేమ పథకాలను అందిస్తూ వారి గుండెల్లో నిలిచిపోయారని ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పిడుగుపల్లె, అక్కిసిద్దుపల్లె గ్రామాల్లో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆమెకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పథకాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తల్లి పాలతో వ్యాధినిరోధక శక్తి

ప్రొద్దుటూరు క్రైం : తల్లి పాలు తాగించడం వల్ల పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ బద్వేలి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ ఆధ్వర్యంలో వైఎంఆర్‌ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వైఎంఆర్‌ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. సిర్డ్‌ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్‌ఎస్‌ రాజారత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం

కాశినాయన : తల్లిపాలే బిడ్డకు అమృతం అని పోరుమామిళ్ల ఐసీడీఎస్‌ ఇన్‌చార్జి సీడీపీఓ లక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని నరసాపురం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటలోపే బిడ్డకు పాలు పట్టించాలన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతంలా పనిచేస్తాయని, రెండు సంవత్సరాలపాటు బిడ్డకు తల్లిపాలు అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చంద్రకళ, ప్రత్యూష, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, శైలజ, మహిళా సంరక్షణ కార్యదర్శి రాధమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించాలి

బి.కోడూరు : తల్లిపాల విశిష్టత గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్‌ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్‌ ఉదయ్‌కిరణ్‌లు పేర్కొన్నారు. మంగళవారం బి.కోడూరులోని పీహెచ్‌సీలో ఆశ నోడల్‌ ఆఫీసర్‌ పుష్పాంజలి ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

ప్రొద్దుటూరు : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవని ఐసీడీఎస్‌ రూరల్‌ సీడీపీఓ అరుణ కుమారి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆగస్టు మొదటి వారంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.

విద్యార్థులు కోడింగ్‌ స్కిల్స్‌ మెరుగుపరుచుకోవాలి

ప్రొద్దుటూరు : విద్యార్థులు కోడింగ్‌ స్కిల్స్‌ మెరుగుపరుచుకోవాలని వైఎస్సార్‌ ఇంజనీరింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ సి.నాగరాజు తెలిపారు. మంగళవారం కళాశాలలో బోధా సాఫ్ట్‌వేర్‌ ప్రైవేటు లిమిటెడ్‌ కంపెనీ వారిచే కాంపిటీటివ్‌ కోడ్‌ పైన వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో కోడింగ్‌ స్కిల్స్‌ మెరుగుపరుచుకుని బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌ బుధవారం కూడా కొనసాగనుందన్నారు. ప్లేస్‌మెంట్‌ అధికారి ఎస్‌.హరినాథరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపులు భవిష్యత్తులో మరిన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్‌ ఆఫ్‌ ఇంజనీరింగ్‌ ప్రొఫెసర్‌ కేవీ రమణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్లేస్‌మెంట్‌ అధికారి హరినాథ రెడ్డి

మహిళా పోరుయాత్రను జయప్రదం చేయండి

పోరుమామిళ్ల : మండల కేంద్రంలో బుధవారం (నేడు) జరుగనున్న మహిళా పోరు (జీపుయాత్ర)ను జయప్రదం చేయాలని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి గౌసియాబేగం పిలుపిచ్చారు. మంగళవారం ఇక్కడ ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలపై హింస రోజు రోజుకు పెరుగుతున్నదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు హింసను నిరోధించే చర్యలు చేపట్టేంత వరకు మహిళా సంఘం పోరు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా పోరు యాత్ర జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండు వద్ద బహిరంగసభ ఉంటుందన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కడప అర్బన్‌: కడప నగరంలోని ఎన్టీఆర్‌ సర్కిల్‌ సమీపంలో షేక్‌ ఖాజావల్లీ (45) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కడప ఒన్‌టౌన్‌ ఎస్‌ఐ రంగస్వామి తెలిపిన వివరాల మేరకు.. పోరుమామిళ్లకు చెందిన ఖాజావల్లీ ఎన్టీఆర్‌ సర్కిల్‌ సమీపంలో ఓ టైలర్‌ షాపులో పనిచేస్తుండేవాడు. ఖాజావల్లీ తాను పనిచేస్తున్న టైలర్‌ షాపులోనే ఉండేవాడు. సోమవారం రాత్రి అక్కడే పడుకున్న అతను తెల్లారేసరికి మృతి చెందాడు. టైలర్‌ షాపు ఓనర్‌ అన్వర్‌ హాఖ్‌ కుటుంబసభ్యులు షాపు తెరిచి చూసి అతడు మృతి చెందిన విషయాన్ని గమనించారు. సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. అతను అనారోగ్య సమస్యలతో మృతి చెందాడా? లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే విషయం పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తెలియాల్సి వుంది. మృతుని సోదరి షేక్‌ రహమత్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప ఒన్‌టౌన్‌ ఎస్‌ఐ రంగస్వామి తెలియజేశారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్‌

ఖాజీపేట : అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు సీజ్‌ చేశారు. ఏటూరు సమీపంలోని నది నుంచి ఇసుక రవాణా చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డికి సమాచారం రావడంతో అక్కడ వెళ్లి ట్రాక్టర్లను సీజ్‌ చేశారు.

విజిలెన్స్‌ అధికారుల దాడి

మైదుకూరు : మైదుకూరులో అక్రమ సిగరెట్ల వ్యాపారంపై మంగళవారం సాయంత్రం విజిలెన్స్‌ అధికారులు దాడి చేశారు. దాడిలో మైదుకూరుకు చెందిన ఓ వ్యాపారి వద్ద నుంచి 831 నకిలీ సిగరెట్ల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ సిగరెట్ల విలువ రూ.2,82,540 ఉంటుందని విజిలెన్స్‌ సీఐ టి.రెడ్డప్ప రెడ్డి తెలిపారు. కడప రీజనల్‌ విజిలెన్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి, అడిషనల్‌ సూపరింటెండెంట్‌ ఆఫ్‌ పోలీస్‌ షేక్‌ మాసూం బాషా ఆదేశాల మేరకు దాడులు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టణంలోని న్యూ వినాయకనగర్‌కు చెందిన సి.వెంకటసుబ్బయ్య వివిధ రకాలైన నకిలీ సిగరెట్లను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు తెలిపారు. వ్యాపారి వెంకటసుబ్బయ్య, అతనికి సహకరించిన ప్రొద్దుటూరుకు చెందిన వంకదారి సుబ్బయ్యపై మైదుకూరు అర్బన్‌ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్‌ కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. దాడుల్లో అసిస్టెంట్‌ జియాలజిస్ట్‌ జి.శ్రీనివాసులు, అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ విజయ్‌కిశోర్‌, సీఎస్‌ డీటీ గంతి చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

కుష్టు కేసుల గుర్తింపులో జిల్లా మూడో స్థానం


ప్రొద్దుటూరు క్రైం : ఎల్‌సీడీసీ సర్వేలో కేసులు గుర్తించడంలో కడప జిల్లా 3వ స్థానంలో ఉందని అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌ ఖాదర్‌వలి తెలిపారు. సర్వేలో భాగంగా గుర్తించిన కుష్టు కేసులను మంగళవారం జిల్లా ఆస్పత్రిలో డాక్టర్‌ ఖాదర్‌వలి నిర్ధారణ చేశారు. అనంతరం శ్రీనివాసనగర్‌ అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌సీడీసీ సర్వే 90 శాతం పూర్తయిందని, మిగిలిన సర్వే కూడా త్వరగా పూర్తి చేయమని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి దినేష్‌, ఫిజియోథెరపిస్టు విక్టర్‌ మనోహర్‌, డీపీఎంఓ శివశంకరయ్య, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ వెంకటేశ్వర్లు, సీఓ నాగజ్యోతి, ఎంఎన్‌ఓలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జెడ్పీలో రూముల వేలం పాట

కడప ఎడ్యుకేషన్‌: మైదుకూరులోని కడప జిల్లా పరిషత్తుకు సంబంధించిన రూముల వేలం పాట మంగళవారం జెడ్పీలో ప్రశాంతంగా జరిగింది. జెడ్పీ ఆవరణంలోని డీపీఆర్‌సీ భవనంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటలో మైదుకూరుకు చెందిన వెంకటసుబ్బయ్య, మస్తాన్‌, చంద్రాయుడు, లక్ష్మినరహరి, కరీముల్లా, సురేష్‌లు పాల్గొన్నారు. ఈ వేలం పాటలో పాల్గొన్న ఈ 6 మంది అభ్యర్థులు ఒకొక్కరు రూ 5. వేలు డీడీని చెల్లించి పాటలో పాల్గొన్నారు. ఈ వేలం పాటలో రూములు దక్కించుకున్న వారి నుంచి ఒకొక్కరి దగ్గర రూ.2 లక్షలు డిపాజిట్‌ను కట్టించుకుని వారికి మూడు సంవత్సరాల పాటు అగ్రిమెంట్‌ను ఇవ్వనున్నారు. రూములు దక్కించుకోనివారి డీడీలను అధికారులు తిరిగి వెనక్కు ఇచ్చారు.

నివాస, నివాసేతర గృహాల జాబితా సిద్ధం

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలో నివాస, నివాసేతర గృహాల జాబితాను సిద్ధం చేసినట్లు మున్సిపల్‌ చైర్మన్‌ మాచనూరు చంద్ర తెలిపారు. మంగళవారం స్త్రీ శక్తి భవనంలో మున్సిపల్‌ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్‌ చైర్మన్‌ మాట్లాడుతూ మున్సిపాలిటీలో నివాస, నివాసేతర గృహాలను డబుల్‌ అసెస్మెంట్లుగా గుర్తించి వాటి వివాలను తయారు చేయాలని మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ అధికారులు కోరినట్లు తెలిపారు. ఆ మేరకు మున్సిపాలిటీలో డబుల్‌ అసెస్మెంట్‌ జాబితాను తయారు చేసినట్లు పేర్కొన్నారు. మున్సిపల్‌ ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అయిన ఖర్చులను చెల్లించేందుకు రూ.9,24,876 మంజూరైనట్లు చెప్పారు. సమావేశంలో పాల్గొన్న పలువురు కౌన్సిలర్లు తమ వార్డులోని సమస్యలను చైర్మన్‌ దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్‌ ఇన్‌చార్జి కమిషనర్‌ పరమేశ్వర్‌రెడ్డి, ఏఈ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్‌ చైర్మన్‌ మాచనూరు చంద్ర

పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

చాపాడు: పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పశు బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నగురువళూరు గ్రామంలోని పశు వైద్యశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పశు వైద్యశాలలోని రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరు, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు అనేక రకాలైన పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. రైతులు ఆర్థికంగా నష్టపోకుండా పశు బీమా అవకాశం కల్పించిందన్నారు. సబ్సిడీతో సమీకృత దాణా సరఫరా చేస్తోందన్నారు. స్థానిక పశు వైద్యాధికారి సుదర్శన్‌రెడ్డిని ఇక్కడి పాడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



పశు వైద్య అధికారితో మాట్లాడుతున్న ప్రసాద్‌రెడ్డి

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్‌ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌, ఎంప్లాయిస్‌ యూనియన్‌ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్‌ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం గేటు వేసి కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్‌ పట్టణ గౌరవాధ్యక్షుడు కె.సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్‌ పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ కార్మికులను పర్మినెంట్‌ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో విజయకుమార్‌, చంటి, సాల్‌మోన్‌, రాఘవేంద్ర, రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.